క్లుప్తంగా

ఆధునికీకరణ పనుల పరిశీలన



ట్యాంక్ వద్ద గట్టును శుభ్రం చేస్తున్న దృశ్యం

దెందులూరు: కోమటిలంక గ్రామంలో మంచినీటి ట్యాంక్ చుట్టూ చేపట్టిన ఆధునికీకరణ, శానిటేషన్ పనులను ఏలూరు రూరల్ మండల ఎంపీడీఓ కె.శ్రీలత శనివారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెత్తా చెదారం, తుప్పలను తొలగించారు. గట్లను శుభ్రం చేశారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్ బి.కృష్ణ

ఏలూరు (టూటౌన్): స్థానిక ఆర్ఆర్ పేటలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 129 మందికి వైద్య సేవలు అందించారు. అనంతరం మందులు ఉచితంగా పంపిణీ చేశారు. శ్రీకృష్ణ ఆస్పత్రిలో నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్ బి.కృష్ణ, డాక్టర్ రవికిరణ్, డాక్టర్ దిలీప్ తదితరులు సేవలందించారు.

వరద బాధితులకు సహాయ పునరావాస కార్యక్రమాలు



దాచరం ఆర్అండ్ఆర్ కాలనీలో పర్యటిస్తున్న ఆర్డీఓ ఎంవీ రమణ

కుక్కునూరు: గోదావరి వరద ముంపు ప్రమాద మండలాల్లోని ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కుక్కునూరు మండలం గొమ్ముగూడెం గ్రామంలోని వరద ముంపు బాధితులను దాచారంలోని ఆర్అండ్ఆర్ కాలనీలో ఏర్పాటుచేసిన వరద పునరావాస శిబిరానికి తరలించి, ప్రజలకు భోజన వసతి సౌకర్యాలను కల్పిస్తున్నారు. జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి, ఆర్డీఓ ఎంవీ రమణ పునరావాస కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. కుక్కునూరు మండలంలోని అన్ని గ్రామాల్లో వరద ప్రమాద హెచ్చరికపై టాంటాం చేస్తూ, మండలంలోని ప్రజలు గోదావరి నదిలోకి చేపల వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. జిల్లా సర్వే అధికారి అన్సారీ, తహసీల్దార్ కె.రమేష్ కుమార్, రెవెన్యూ, పౌర సరఫరాలు, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల సిబ్బంది పునరావాస కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఠారెత్తిస్తున్న ఎండలు

- మరో నాలుగు రోజులపాటు అధిక ఉష్ణోగ్రతలు
- ఏలూరులో ప్రజల బెంబేలు



ఎండ కారణంగా నిర్మానుష్యంగా మారిన రహదారి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగర ప్రజలను ఎండలు ఠారెత్తిస్తున్నాయి. వేసవి కాలం ముగిసిపోయి, రుతుపవనాలు దేశంలోకి, రాష్ట్రంలోకి వచ్చి నెల రోజులు దాటేస్తోంది. వర్షాకాలం ప్రవేశించి దాదాపు నెల రోజులు కావస్తున్నా నగరంలో పెద్దగా వానలు పడిన దాఖలాలు. అడపాదడపా వానలు పడినా వర్షాకాలం ప్రభావం కనిపించలేదు. ఈ నెల కాలంలో ఏలూరు నగరంలో వేళ్లపై లెక్కించదగినన్ని రోజులు మాత్రమే వానలు కురిసి మమ అనిపించాయి. అయితే ఉష్ణోగ్రతలు వేసవిని తలిపించేలా నమోదవుతున్నాయి.

వేసవిని తలిపించేలా ఉష్ణోగ్రతలు

గత వారం రోజులుగా ఏలూరు నగరంలో ఉష్ణోగ్రతలు పెరుగుతూ ఉండడంతో మరోసారి వేసవి వచ్చిందని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. సాధారణంగా వేసవి కాలం నాలుగు నెలలు, వర్షాకాలం నాలుగు నెలలు, శీతాకాలం నాలుగు నెలలు ఉంటుంది. అయితే ఈ ఏడాది వానాకాలం నెల రోజుల్లోనే వెళ్లిపోయిందా అనే అనుమానాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. వానా కాలం వచ్చినా ఏసీలు, ఫ్రిజ్‌ల వినియోగంలో ఎటువంటి మార్పు రాలేదని, కూలింగ్ వాటర్ కోసం వెంపర్లాడాల్సివస్తుందని, కాసేపు బయటకు వెళితే ఎండ దెబ్బకు ఎప్పుడు ఏసీలోకి వెళాదామా అనే ఆలోచన వస్తోందంటున్నారు. జ్యూస్‌లు, కూల్ డ్రింకులు, ఐస్‌క్రీంలు వంటి పదార్థాలు, పానీయాల విక్రయాలు సైతం వేసవి మాదిరిగానే ఉన్నట్టు చెబుతున్నారు.

ఉక్కిరిబిక్కిరి

ఒక పక్క గత వారం రోజుల నుంచి అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడిపోతుండగా, మరో నాలుగు రోజుల పాటు ఇదే వాతావరణం కొనసాగుతుందని వాతావరణ శాఖ ప్రకటించింది. వేసవి కాలం ముగిసిన తరువాత గత వారం రోజులుగా నగరంలో 34 నుంచి 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతున్నాయి. శనివారం 36 డిగ్రీలు నమోదు కావడం ఆందోళనకు గురి చేస్తోంది. అయితే ఆది, సోమవారాల్లో కూడా 36 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదౌతాయని, మంగళ, బుధవారాల్లో 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదౌతాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీంతో ఇప్పుడప్పుడే వాతావరణం చల్లబడే పరిస్థితి కనిపించడంలేదనే భావన ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

నగరంలో విచిత్ర వాతావరణం

నగరంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు విపరీతమైన ఎండలు కాస్తుండగా సాయంత్రం వాతావరణంలో కారుమబ్బులు కమ్ముకుంటున్నాయి. ఏక్షణాన అయినా కుండపోత వర్షం కురుస్తుందన్నట్టుగా దట్టమైన మబ్బులు పట్టడం కొంతసేపటికి పెద్ద ఎత్తున గాలి వీచి మబ్బులు తరలి వెళ్లిపోవడం ప్రజలు ఉసూరుమనడం గత కొన్ని రోజులుగా జరిగిపోతుంది. శనివారం ఉదయం భారీ వర్షం కురిసి రోడ్లన్నీ నీటితో మునిగిపోయాయి. ఉదయం 8 గంటలకే భానుడు భగభగ లాడుతూ దర్శనమిచ్చాడు. సాయంత్రం 6.30 గంటల వరకూ నగరంపై భానుడి ప్రతాపం కొనసాగింది. 6.30 గంటల తరువాత సూర్యుడు శాంతించినా వాతావరణంలో వేడి మాత్రం తగ్గలేదు. మధ్యాహ్నం ఎండ దాదాపు వేసవి వాతావరణాన్ని తలపించింది. మహిళలు తలపై కొంగులు, గొడుగులు కప్పుకుని రాకపోకలు సాగించారు. తప్పని పనులపై బయటకు వచ్చిన పురుషులు సైతం తొందరగా ఇళ్లకు చేరుకోవడానికి ప్రయత్నించారు. రెండో శనివారం ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలకు సెలవు కావడంతో పెద్దగా జన సంచారం లేకపోవడం, ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు కావడంతో మధ్యాహ్నం ఒంటి గంట దాటిన తరువాత రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి.

గోవుల సంరక్షణకు సమష్టి బాధ్యత



మునగాల మురళీకృష్ణ

దెందులూరు: గోవుల సంరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఏలూరు గో సంరక్షణ సమితి కార్యదర్శి మునగాల మురళీకృష్ణ అన్నారు. శనివారం దెందులూరు నియోజకవర్గం చాటపర్రు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఏలూరు గో సంరక్షణ సమితి ఏర్పాటుచేసి 108 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఈ సమితి ఆధ్వర్యంలో చాటపర్రు, కొమడవోలు, కొప్పాక, ఏలూరు కేంద్రాల్లో 506 గోవులు ఉన్నాయని తెలిపారు. శాశ్వత గో పోషణకు దాతలు రూ.5 వేలు, అంతకన్నా ఎక్కువ ఇచ్చిన వారి పేరు రిజిస్ట్రేషన్ చేస్తామని వివరించారు.

పండ్లు, రొట్టెల పంపిణీ

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి గ్రామంలోని ప్రేమాలయం వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు కొల్లేరు సంక్షేమ సేవా సమితి చైర్ పర్సన్ ముంగర ఉమాదేవి శనివారం పండ్లు, రొట్టెలు పంపిణీ, అన్నదానం చేశారు. తన వంతు సాయం అందించానని ఆమె తెలిపారు. వృద్ధుల సేవ దేవుని సేవతో సమానమని, తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో వదిలివేయటం బాధాకరమని అన్నారు. వృద్ధాశ్రమంలో చైర్మన్ టి.వెంకటేష్ గురూజీ, కార్యదర్శి మునగాల మురళీకృష్ణ, ట్రెజరర్ చిత్రాలయ రాంబాబు తదితరులున్నారు.

ప్రజల కోసం పోరాడాలి



జయప్రకాష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న లంకలపల్లి గణేష్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వైఎస్సార్‌సీపీలో కీలక పదవుల్లో నియమితులైన నాయకులు ప్రజల కోసం చేసే పోరాటాల్లో ముందుండాలని ఆపార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) పిలుపునిచ్చారు. పార్టీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన లంకలపల్లి గణేష్ శనివారం జేపీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో భయానక వాతావరణం నెలకొందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తున్నారని, అటువంటి సందర్భాల్లో బాధితులకు వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా నిలవాల్సిన అవసరం పార్టీ నాయకులపై ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు స్టాలిన్, పాతినివలస రాజేష్, నేతల కోటి, జంప నాగేశ్వరరావు, సూరిశెట్టి వీరస్వామి, మద్దాల ఫణి, బండ్లమూడి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

'మోసపు హామీల రాజకీయం నిలవదు'



పోస్టర్ విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: బాబు మోసాన్ని ప్రతి ఒక్కరూ ఎండగట్టాలని, మోసపు హామీలతో రాజకీయం ఎక్కువకాలం ఉండదని వైఎస్సార్ సీపీ దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శనివారం ఆయన కార్యాలయంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ పెదవేగి మండలం పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. అభివృద్ధి సంక్షేమం మౌలిక వసతులు సంగతి గాలికి వదిలేసి దౌర్జన్యాలు, దాడులు, అక్రమ కేసులు విధింపులు, కొట్టాటలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అబ్బయ్యచౌదరి ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు అమలు కాని హామీలతో ప్రజలను నమ్మించి ఇంటింటికీ హామీల బాండ్లను పంపించి అధికారం చేపట్టాక వాటిని విస్మరించారని ఆరోపించారు. హామీలను అమలు చేయకుండా యువత, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, బీసీలు ఇలా అన్నివర్గాలను ఏడాదికిపైగా మోసం చేశారని విమర్శించారు. ఏం ఒరగబెట్టారని తొలి అడుగంటూ ప్రజల్లోకి వెళ్తున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ఇచ్చిన హామీలను ప్రజలకు అమలుచేసే విధంగా ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. ప్రతి నెలా ఏదోక సంక్షేమాన్ని అందించే జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనస్సు గెలుచుకున్నారని, ప్రజల్ని ఎలా మోసం చేయాలో చంద్రబాబుకు బాగా తెలుసునని అన్నారు. ఉచిత బస్సు పథకం తుస్సుమనిపించారని, జిల్లా పరిధి వరకే ఉచిత బస్సు అంటూ ప్రకటన చేయడం మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్ బాబు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మేకా లక్ష్మణరావు, పెదవేగి మండల అధ్యక్షుడు జానంపేట ప్రసాద్, నాయకులు మేడికొండ కృష్ణారావు బాబు, అన్ని గ్రామాల సర్పంచులు పార్టీ అధ్యక్షులు కోఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షులు, కార్యకర్తలు ఉన్నారు.

చరిత్రలో మాల యోధుల పాత్ర అమోఘం



సెమినార్‌లో మాట్లాడుతున్న రిటైర్డ్ ఏసీటీఓ రామారావు

ఏలూరు (టూటౌన్): భారతదేశ చరిత్రలో మాల యోధుల విశిష్టత మేధావుల పాత్ర చాలా ఘనమైనదని దళిత సాహిత్య పరిశోధక గ్రంథ రచయిత రిటైర్డ్ కమర్షియల్ ట్యాక్స్ స్టేట్ ఆఫీసర్ బొనిగల రామారావు అన్నారు. స్థానిక అశోక్ నగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో నేతల రమేష్ అధ్యక్షతన శనివారం ఏర్పాటుచేసిన భారత దేశ చరిత్రలో మాల యోధుల విశిష్టత, మేధావుల పాత్రపై సెమినార్‌లో రామారావు మాట్లాడారు. ప్రాచీన భారతదేశ చరిత్రలో మాలయోధులు మాల మేధావులు నిర్వహించిన పాత్ర అమోఘమైనదన్నారు. గత చరిత్రను యువత తెలుసు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. చారిత్రక ఆధారాలతో పురాతన గ్రంథాల్లో ఉన్న అనేక అంశాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా, జేఏసీ చైర్మన్ చాగంటి సంజీవ్, ఏలూరు కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, పల్లెం ప్రసాద్, డాక్టర్ మెండెం సంతోష్ కుమార్, ప్రొఫెసర్ ఎస్ఏడీ పాల్, దాసరి నాగేంద్ర కుమార్, అలుగు ఆనంద శేఖర్, ఎరికిపాటి విజయ్, కాపుదాసి రవి, గొల్ల కిరణ్, కర్నకోటి దిలీప్, పాము రవీంద్ర, దోమతోటి అబ్రహాం, గంజి మధు, సీహెచ్ సాయిరాజ్, దాసి వెంకటేశ్వర్లు కర్రే అంబేద్కర్, గుదే రాంబాబు, పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్, మాదేపల్లి సర్పంచ్ కొరపాటి బాబు, తేరా ఆనంద్, పాము శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ క్రైస్తవులను ఎస్సీలుగానే పరిగణించాలి



కరపత్రం విడుదల చేస్తున్న ఫాదర్ ఆంథోని తదితరులు

ఏలూరు (టూటౌన్): ఎస్సీ క్రైస్తవులను ఎస్సీలుగానే పరిగణించాలని కతోలి ఎస్సీ, బీసీ కమిషన్ కార్యదర్శి ఫాదర్ ఆంథోని డిమాండ్ చేశారు. ఆగస్టు ఏడో తేదీన నిర్వహించే రాష్ట్రపతి ఆర్డినెన్స్‌పై శనివారం సాయంత్రం స్థానిక నరసింహారావుపేటలోని ఎస్సీఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆంథోని మాట్లాడారు. రాష్ట్రంలో, ఈ దేశంలో ఎస్సీలను అలాగే, ఎస్సీ క్రైస్తవులను ఎస్సీలుగానే పరిగణించాలని గత దశాబ్దాలుగా చేస్తోన్న పోరాటానికి నేటికీ పరిష్కారం దొరకని పరిస్థితి ఉందన్నారు. సంతోష్ కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఎస్సీలు, ఎస్సీ క్రైస్తవులతో భారీ సభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎస్సీలు, ఎస్సీ క్రైస్తవులపై నిత్యం దాడులు జరగడం అత్యంత హేయమైన చర్యగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా కరపత్రం విడుదల చేశారు. సమావేశంలో దోమతోటి అబ్రహాం, ప్రొఫెసర్ ఎస్ఏడీ పాల్, విద్యావేత్త అలుగు ఆనంద్ శేఖర్, నూకపెయ్యి కార్తీక్, పాస్టర్ బాబురావు, రాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలతోనే భవిష్యత్తు

దెందులూరు: అప్పుడే పుట్టిన చిన్నారి నుంచి ఐదేళ్లలోపు వారందరికీ విధిగా తల్లిదండ్రులు టీకాలు వేయించాలని గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు రాకేష్, రోజు మేరీ అన్నారు. శనివారం గోపన్నపాలెం పీహెచ్‌సీ పరిధిలో సబ్ సెంటర్‌లో చిన్నారులకు టీకాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాకేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోకుండా నిర్లక్ష్య వైఖరితో ఉంటే చిన్నారుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. తల్లిదండ్రులు చిన్నారుల ఆరోగ్యంతో పాటు తమ ఆరోగ్యాల సంరక్షణలో కూడా బాధ్యతలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో ఉన్న వైద్య సిబ్బందికి తల్లిదండ్రులు అన్ని గ్రామాల్లో ప్రజలు సహకరించాలని వైద్యులు కోరారు. దెందులూరు సబ్ సెంటర్‌లో ఏఎన్ఎం సుభాషిణి, వైద్య సిబ్బంది టీకాలు చిన్నారులకు వేశారు.

వానలు లేక.. మెట్టలో దిగాలు



చింతలపూడిలో ఖరీఫ్ దుక్కులు దున్నుకుని నాట్లు వేయదానికి సిద్ధం చేసిన భూములు

చింతలపూడి: జోరుగా వ్యవసాయం సాగాల్సిన ప్రస్తుత తరుణంలో వానలు రాక మెట్ట రైతులు దిగులు చెందుతున్నారు. దుక్కులు దున్ని, నేలను చదును చేసుకుని ఖరీఫ్ వ్యవసాయానికి సిద్ధంగా ఉన్న రైతులకు వర్షాలు వెనుకబడటం నిరాశను మిగిల్చాయి. సబ్‌డివిజన్ పరిధిలోని చింతలపూడి నియోజకవర్గంలో 18,384 హెక్టార్లలో వరి సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో చింతలపూడి మండలంలో అత్యధికంగా 7,603 హెక్టార్లు, లింగపాలెం మండలంలో 3,072 హెక్టార్లు, కామవరపుకోట మండలంలో 2,457 హెక్టార్లు, జంగారెడ్డిగూడెం మండలంలో 5,252 హెక్టార్లలో వరి పంటను సాగు చేస్తారు. ప్రతి ఏటా రైతులు ఈ పాటికి 50 శాతం వరి నాట్లు పూర్తి చేసేవారు. కానీ సాగునీటి ఇబ్బందుల దృష్ట్యా ఇప్పటివరకు 25 శాతం నాట్లు కూడా పూర్తికాలేదు. ఆకుమడి వేసిన 30, 35 రోజుల్లో నాట్లు వేయడం పూర్తి చేస్తే దిగుబడి బాగా వస్తుందని, వర్షాభావ పరిస్థితుల కారణంగా నాట్లు వేయడం ఆలస్యమయ్యేలా ఉందని అంటున్నారు. వర్షాలు ఆలస్యం కావడంతో ఆగస్టు నెలాఖరు వరకూ నాట్లు వేయడం కొనసాగేలా ఉందని మెట్ట రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా మెట్ట ప్రాంతానికి శాశ్వత సాగు నీటి వసతులు కల్పించడానికి నేతలు కృషి చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

శాశ్వత సాగు నీరు ఒక్కటే మార్గం



మెట్ట ప్రాంతానికి శాశ్వత సాగు నీరు ఒక్కటే మార్గం. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తయితే మెట్ట ప్రాంతంలో సాగు నీటి ఇబ్బందులు తొలగిపోతాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చింతలపూడి ఎత్తిపోతల పథకానికి రూ.1,931 కోట్ల నాబార్డు రుణం మంజూరైంది. ఆ నిధులతో తక్షణం పథకాన్ని పూర్తి చేసి రైతులకు గోదావరి జలాలను శాశ్వతంగా అందించాలి.

– కంభం విజయరాజు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	34	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	70
వంకాయలు (కాంతులు)	48	బీన్సచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	48	చామదుంపలు	36
బెండకాయలు	30	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	78	కంద	--
కాకర కాయలు	40-48	బీట్‌రూట్	38
బీరకాయలు	00	కీరా దోస	50
బీరకాయలు (పందిరి)	54	ఫ్రెంచ్‌బీన్స్	112
క్యాబేజీ	24	అల్లం	60
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	40	పాలకూర	12
బంగాళదుంపలు	30-32	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	12
గోరుచిక్కుడు	48	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	11
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	24
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	23
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	02
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో 22సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	15
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	09
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	16
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	17
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	15
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

కాంటూర్ లెక్కలతో అందని పరిహారం

- ఆందోళన చెందుతున్న నిర్వాసితులు
- వరదల్లో తమ ఇళ్లు మునిగిపోతున్నాయని ఆవేదన
- తమకూ నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్



ఎఫ్ ఆర్ ఎల్ లోపల ఉన్న ఇళ్లు

కుక్కునూరు: పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ ముంపులో ముందుగా మునుగుతున్నా 45 కాంటూర్ పరిధి అంటూ ప్రభుత్వం పరిహారం ఇవ్వకపోవడంతో ప్రతి ఏడాది గోదావరి వరదలకు ఇబ్బంది పడుతున్నట్టు కుక్కునూరు నిర్వాసితులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఉమ్మడి రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం ప్రారంభానికి ముందు బ్యాక్ వాటర్‌లో ముంపునకు గురవుతున్న ప్రాంతాన్ని గుర్తించిన అధికారులు ఎఫ్ఆర్ఎల్ (ఫుల్ రిజర్వాయర్ లెవల్) స్టోన్‌లను ఏర్పాటు చేశారు. అలా కుక్కునూరు గ్రామంలో శివాలయం పక్కనే ఉన్న ఇళ్లు కూడా ఎఫ్ఆర్ఎల్ పరిధిలో ఉన్నాయి. ప్రతి ఏడాది వరదల సమయంలో గోదావరి వరదకు ఈ ఇళ్లు ముంపునకు గురవుతున్నాయి.

నిర్వాసిత గ్రామాలకు పరిహారం అందించాలి

రాష్ట్ర విభజన అనంతరం అప్పటి పీఓ మరోసారి ఇళ్లను సర్వే చేసి ఏ, బీ, సీ బ్లాకులుగా విభజించారు. అనంతరం ఏ బ్లాక్ ను 41.15 కాంటూర్ పరిధి అంటూ, బీ ,సీ బ్లాక్‌లను 45 కాంటూర్ అంటూ విభజించారు. ఇటీవల 41 కాంటూర్ పరిధిలోని ఇళ్లకు ఆర్అండ్ఆర్ పరిహారాన్ని కూడా జమచేశారు. కాని ఏబ్లాక్‌లో ఉన్న ఇళ్లు పూర్తిగా ముంపునకు గురవక ముందే వరద నీటిలో ముంపు గురవుతున్న తమ ఇళ్లు 45 కాంటూర్ పరిధి అంటూ పరిహారం చెల్లించడం లేదని ఆ ప్రాంత నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులను కలిసి వినతిపత్రాలు అందించగా ఇరిగేషన్ శాఖకు సర్వే నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినట్టు బాధితులు చెప్పారు. ఇది జరిగి నెలలు గడుస్తున్నా ఇరిగేషన్ అధికారులు వచ్చి సర్వే చేసింది లేదని బాధితులు ఆరోపించారు. ఇకనైనా నిర్వాసిత మండలాల్లో కాంటూర్ లెక్కలను పక్కనపెట్టి నిర్వాసిత గ్రామాలన్నిటికి పరిహారం అందించాలని బాధితులు డిమాండ్ చేశారు.